400 లక్షల కోట్ల దిగువకు..

క్షీణించిన బీఎస్ఈ సంస్థల విలువ

ముంబై, ఫిబ్రవరి 18: బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.400 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోతుండటం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మదుపరుల్లో సెంటిమెంట్ నీరుగారింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో మంగళవారం రూ.2,01,032.5 కోట్లు కరిగిపోయి రూ.3,89,31,067.30 కోట్ల(4.58 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో తొలిసారిగా రూ.400 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించిన బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ 10 నెలల్లో ఈ మైలురాయిని కోల్పోవడం విశేషం. గతేడాది సెప్టెంబర్ 27న చారిత్రక గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన బీఎస్ఈ సెన్సెక్స్ ప్రస్తుతం 10,010.86 పాయింట్లు లేదా 11.64 శాతం వాటాను కోల్పోయింది.

సూచీలదీ అదేదారి

స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎఫ్ఐఐల పెట్టుబడులు ఉపసంహరణ, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మంగళవారం సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 29.47 పాయింట్లు నష్టపోయి 75,967.39 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 14.20 పాయింట్లు కోల్పోయి 22,945.30 వద్ద స్థిరపడింది. మార్కెట్లో ఇండస్ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ఐటీసీ, టాటా మోటార్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోగా..ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా, జొమాటో, పవర్‌గ్రిడ్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఇండస్ట్రియల్స్ 1.51 శాతం నష్టపోగా, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.19 శాతం, టెలికం 1.06 శాతం, క్యాపిటల్ గూడ్స్, వాహన రంగ షేర్లు నష్టపోయాయి. కానీ, యుటిలిటీ, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఎనర్జీ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

మంగళవారం న్యూఢిల్లీలో ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్థిక సేవల కార్యదర్శి నాగరాజు తదితరులు

ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) సంస్థ మంగళవారం ఓ సరికొత్త ప్లాన్‌ను పరిచయం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు చేతులమీదుగా దీన్ని ఆవిష్కరించింది. ఇక ఇదో నాన్-లింక్డ్, వ్యక్తిగత/బృంద, పొదుపు, తక్షణ యాన్యుటీ ప్లాన్. సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ రకాల కోసం విస్తృత శ్రేణిలో యాన్యుటీ ఆప్షన్లను అందిస్తుంది. జీవించి ఉన్న పాలసీదారులకైనా, మరణించిన పాలసీదారుల నామినీలు, వారసులకైనా ప్లాన్ నిబంధనలకు లోబడి ఎంచుకున్నవిధంగా ఒకేసారి లేదా వాయిదా పద్ధతుల్లో చెల్లింపులుంటాయి. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల విభాగం అదనపు కార్యదర్శి ఎంపీ తంగిరాల, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కుమార్ గోయల్‌లతోపాటు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతీ ఇతర మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ప్రత్యేకతలు

- సింగిల్ ప్రీమియం, తక్షణ యాన్యుటీ.
- కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా విస్తృత రీతిలో యాన్యుటీ ఆప్షన్లు.
- పాలసీదారుడి కనీస వయసు 18 ఏండ్లు. గరిష్ఠ వయసు యాన్యుటీ ఆప్షన్‌నుబట్టి 65 నుంచి 100 ఏండ్లు.
- సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ ఆప్షన్లను ఎంచుకునే వెసులుబాటు.
- ప్రస్తుత పాలసీదారులకు, చనిపోయిన పాలసీదారుల నామినీ లేదా వారసులకు యాన్యుటీ రేటు పెంపు ద్వారా ఆకర్షణీయ ప్రోత్సాహకాలు.
- పాలసీ నిబంధనలకు లోబడి పాక్షికంగానైనా లేదా పూర్తిస్థాయిలో నగదు ఉపసంహరించుకొనే సౌకర్యం.
- కనీస కొనుగోలు ధర లక్ష రూపాయలు. దీన్ని మించి ఎక్కువగా కొంటే ప్రోత్సాహకాలూ లభిస్తాయి.
- వార్షిక, అర్ధ వార్షిక, త్రైమాసిక, నెలవారీ చెల్లింపులకు అవకాశం. వీటికి తగ్గట్టే యాన్యుటీ వాయిదాలుంటాయి.
- ప్రత్యేకంగా ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్లకు తక్షణ యాన్యుటీకి వెసులుబాటు.
- దివ్యాంగుల కోసం కూడా ప్రయోజనకర ఆప్షన్లు.
- www.licindia.in ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాన్‌ను కొనవచ్చు. ఎల్ఐసీ ఏజెంట్, ఇతర ఆఫ్‌లైన్ మార్గాల ద్వారా కూడా కొనవచ్చు.
- ప్లాన్ కొన్న 3 నెలల తర్వాత ఎప్పుడైనా పాలసీదారులు రుణ సదుపాయం తీసుకునే వీలుంటుంది.

ఎన్ఎస్ఈ విలువ రూ.4.7 లక్షల కోట్లు

- గత ఏడాది 201 శాతం వృద్ధి

ముంబై, ఫిబ్రవరి 18: నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) విలువ రూ.4.7 లక్షల కోట్లకు చేరిందని ఓ తాజా నివేదిక పేర్కొన్నది. దేశంలోని అతిపెద్ద ఈక్విటీ మార్కెట్ వేదికల్లో ఒకటైన ఎన్ఎస్ఈ.. త్వరలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారతీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన, నమోదుకాని 500 భారీ సంస్థలతో బుర్గండి ప్రైవేట్ హురున్ ఇండియా 2024కుగాను ఓ జాబితాను తీసుకొచ్చింది. ఇందులో గత ఏడాది ఎన్ఎస్ఈ విలువ ఏకంగా 201 శాతం పుంజుకున్నట్టు తేలింది. ఇక దేశంలో అత్యంత విలువైన కంపెనీల్లో ఎన్ఎస్ఈ 10వ స్థానంలో ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఎన్ఎస్ఈ స్థూల ఆదాయం 28 శాతం పుంజుకొని రూ.16,352 కోట్లుగా నమోదైంది. పన్ను అనంతర లాభం 51 శాతం ఎగిసి రూ.8,306 కోట్లుగా ఉన్నది. కాగా, ఇటీవలే లిస్టింగ్ ప్రక్రియను మొదలుపెట్టిన ఎన్ఎస్ఈ.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దరఖాస్తు చేసుకున్నది. పబ్లిక్ ఇష్యూలో 10 శాతం వాటాలను విక్రయించే వీలున్నట్టు అంచనా.

రిలయన్స్ టాప్

రూ.17.5 లక్షల కోట్ల విలువతో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) హురున్ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది. రూ.16.1 లక్షల కోట్లతో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రెండో స్థానంలో ఉండగా, 30 శాతం వృద్ధిని సాధించినట్టు హురున్ పేర్కొన్నది. గ్రూపులవారీగా చూస్తే.. టాటా గ్రూప్ విలువ 37 శాతం వృద్ధితో రూ.32.27 లక్షల కోట్లుగా ఉన్నది. రిలయన్స్ గ్రూప్ రూ.19.71 లక్షల కోట్లుగా ఉంటే.. గౌతమ్ అదానీ గ్రూప్ విలువ

రూ.13.40 లక్షల కోట్లుగా తేలింది. ఇక ఈసారి జాబితాలో చోటు దక్కించుకున్న 500 కంపెనీల్లో ప్రతీదాని విలువ బిలియన్ డాలర్లపైనే. ఈ మొత్తం కంపెనీల వాల్యూ కూడా 3.8 ట్రిలియన్ డాలర్లను తాకింది. రెవిన్యూ ట్రిలియన్ డాలర్లుగా ఉంటే.. లాభం రూ.8 లక్షల కోట్లుగా ఉన్నది. పన్నులు రూ.2.2 లక్షల కోట్లుగా ఉండగా.. ఉద్యోగులు 85 లక్షల మంది ఉన్నారు.

టీవీఎస్ 2025 ఎడిషన్
రోనిన్ బైకు

ప్రారంభ ధర రూ.1.35 లక్షలు

చెన్నై, ఫిబ్రవరి 18: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్‌కు మరో వాహనాన్ని పరిచయం చేసింది. 2025 ఎడిషన్‌గా విడుదల చేసిన 225 సీసీ మోటర్‌సైకిల్ 'రోనిన్'లో భద్రత ఫీచర్లను అప్‌గ్రేడ్ చేసింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.1.35 లక్షలుగా నిర్ణయించింది. డ్యూయల్ చానెల్ ఏబీఎస్ రకం మాడల్ రూ.1.59 లక్షలు. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. 225.9 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 20.4 పీఎస్‌ల శక్తి నివ్వనున్నది. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ..ఈ బైకును యువతకు నచ్చే విధంగా డిజైన్ చేసినట్లు వెల్లడించింది. స్టైలిష్, రైడింగ్ పరంగా కొన్ని మార్పులు చేసినట్టు కంపెనీ పేర్కొన్నది. ఈ మాడల్‌తో సేల్స్ పెరుగుతాయన్న ఆశాభావాన్ని సంస్థ కనబరుస్తున్నది.

క్యూ3 జీడీపీ 6.4%!: ఇక్రా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగా నమోదు కావచ్చని భారతీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 6.7 శాతంగా ఉంటే.. రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో ఏకంగా ఏడు త్రైమాసికాల కనిష్ఠాన్ని తాకుతూ 5.4 శాతంగానే ఉన్న విషయం తెలిసిందే. ఇందుకు మార్కెట్‌లో డిమాండ్ బలహీనపడటం, కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం తగ్గిపోవడం కారణంగా పేర్కొన్న ఇక్రా.. ప్రస్తుతం ఈ రెండు అంశాల్లో పరిస్థితులు మెరుగయ్యాయని అంటున్నది. అందుకే వృద్ధిరేటు అంచనా 6.4 శాతంగా నమోదు కావచ్చని చెప్పింది. కాగా, ఈ నెల 28న అక్టోబర్-డిసెంబర్ త్రైమాసిక జీడీపీ వృద్ధి గణాంకాలను ఎన్ఎస్‌వో అధికారికంగా ప్రకటించనున్నది. కాగా, ఆర్బీఐ వృద్ధి అంచనా ఈసారికి 6.6 శాతంగా ఉన్నది.

స్టార్టప్‌లకు బ్రెజిల్ దన్ను

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. దేశీయ స్టార్టప్‌లకకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో టీహబ్..బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు ఇక్కడ అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా కృత్రిమ మేధస్సు, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ తదితర రంగాల్లో పరస్పర సహకారం ఉంటుందని వారు వివరించారు.

టెస్లా ఇండియాలో నియామకాలు షురూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టాలని ఇప్పటికే ప్రయత్నాలు వేగవంతం చేసిన అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా..తాజాగా ఉద్యోగ నియామకాలను ప్రారంభించింది. అతి త్వరలో తన తొలి షోరూంను ప్రారంభించబోతున్న సంస్థ అందుకుతగ్గట్టుగా రిక్రూట్‌మెంట్లను ఆరంభించింది. తన తొలి షోరూంను ముంబైలో ప్రారంభించబోతున్నట్లు తెలుస్తున్నది. నూతన ఉద్యోగాల్లో సర్వీస్ అడ్వయిజర్లు, సర్వీస్ మేనేజర్లు, స్టోర్ మేనేజర్లు ఉన్నారు.

కజారియా నయా సెంటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18: దేశంలో అతిపెద్ద సిరామిక్ అండ్ విట్రిఫైడ్ టైల్ తయారీ సంస్థ కజారియా..హైదరాబాద్‌లో అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ అన్ని రకాల టైల్స్ లభించనున్నాయని కంపెనీ ఎండీ రిషీ కజారియా తెలిపారు. టైల్స్, బాత్, శానిటరీవేర్ ఉత్పత్తులను ప్రతీ కుటుంబానికి అందించడం లక్ష్యంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు చెప్పారు.

ఆధార్ తిప్పలు

↑ ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయం ఆధార్ సెంటర్ వద్ద జనం

కొత్త ఆధార్‌కార్డు నమోదుతోపాటు కార్డులోని మార్పులు, చేర్పుల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్‌కార్డులోని సవరణలో కోసం అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నా జనం ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. మంగళ వారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం వద్ద జనం రద్దీ కనిపించింది.

-ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 18

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి.సౌజన్య

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి భోనగిరి సౌజన్య

ఎదులాపురం,ఫిబ్రవరి18: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అందుకే డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి భోనగిరి సౌజన్య తెలిపారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకొని ఉండాలని, భవిష్యత్తులో వాటి ద్వారా సమస్యలను పరిష్కరించుకునే వీలు ఉంటుందన్నారు. క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, ఫ్యామిలీ కోర్టు, పోక్సో చట్టాలతోపాటు రాజ్యాంగం బాలలకు కల్పించిన హక్కుల గురించి వివరించారు. దాదాపు 5 వేలకు పైగా చట్టాలు, ఆయా కేసులకు సంబంధించి ప్రత్యేకంగా కోర్టులు కూడా ఉన్నాయన్నారు. 18 సంవత్సరాల్లోపు వారిని బాలలుగా పరిగణిస్తూ వారి హక్కులకు భంగం కలగకుండా చట్టాలు రక్షణ కల్పిస్తాయని పేర్కొన్నారు. లైంగిక వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఏసీ వెంకటేశ్వర్లు, చీఫ్ లీగల్ ఎయిడ్ దాసరి గంగాధర్, డిప్యూటి లీగల్ ఎయిడ్ ఆర్గుల అశోక్, చంద్రకాంత్, అసిస్టెంట్ లీగర్ ఎయిడ్ ఉమేష్ డోలే, జాదవ్ సంగీత, స్పోర్ట్స్ స్కూల్ హెచ్ఎం భూమన్న తదితరులున్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 18 : బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 24న పట్టణంలోని రామ్ లీలా మైదాన్‌లో నిర్వహించనున్న జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల కోడ్ నియమ నిబంధనల ననుసరించి ఉత్సవాలను జరపాలని అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ రాజర్షి షా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంబంధిత అధికారులు ఆర్టీసీ ద్వారా బస్ సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆర్డీవో వినోద్ కుమార్, బంజారా ఉత్సవ కమిటీ చైర్మన్ భీమ్‌రావ్, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సీగ్రేడ్ విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

నిర్మల్ డీఈవో రామారావు

సారంగాపూర్, ఫిబ్రవరి 18 : పదో తరగతి విద్యార్థుల్లోని సీగ్రేడ్ విద్యార్థులపై శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాధికారి రామారావు సూచించారు. మంగళవారం సారంగాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ, పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. సీగ్రేడ్ విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇక్కడ పాఠశాల హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

సామాజిక తనిఖీ ప్రారంభం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి18 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో 2023-ఏప్రిల్ 1 నుంచి 2024-మార్చి 31 వరకు ఈజీఎస్ పథకం ద్వారా సుమారు రూ.8కోట్ల నిధులతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు ప్రారంభించారు. మంగళవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ టీఏతోపాటు ఫీల్డ్ అసిస్టెంట్లు నుంచి జరిగిన పనుల నివేదికలు, ఖర్చులు చేసిన నిధులకు సంబంధించిన రికార్డులను వారి నుంచి సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్పీలు, డీఆర్పీలు సేకరించారు. గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనులపై వారంరోజులపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు పనులు చేసిన కూలీల నివేదికను సేకరించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు ఆటలు ఆడించాలి

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 18 : అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు చదువుతోపాటు ఆటలు ఆడించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండంలోని కాల్వ తండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, పారిశుధ్య పనులు, నర్సరీలను ఆయన సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం రికార్డులను పరిశీలించినారు. ఉపాధి హామీ నర్సరీని పరిశీలించారు. సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో గోవర్ధన్, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి, 18: నిర్మల్ పట్టణంలోని కావేరి చిల్డ్రన్ హాస్పిటల్‌లో నిర్మల్ ఐఏపీ, రెయిన్బో చిల్డ్రన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు గుండె వ్యాధుల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 105 మంది గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్స అవసరమున్న పిల్లలకు రెయిన్బో చిల్డ్రన్ హార్ట్ ఇనిస్టిట్యూట్ సంబంధిత ఫౌండేషన్ ఆర్థిక సాయంతో చికిత్సలు అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్, నిర్మల్ ఐఏపీ అధ్యక్షుడు అప్పాల చక్రధారి, కార్డియాలజిస్ట్ కోనేటి నాగేశ్వర్ రావు, ఐఏపీ రాష్ట్ర సభ్యుడు రమేశ్ గడపాలే, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు మురళీధర్, పాలిశెట్టి సంతోష్, కావేటి శ్రీకాంత్, నాగరంజని, సీనియర్ పిల్లల వైద్య నిపుణులు, సిబ్బంది ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు చేసిన విద్యార్థులు

ఎదులాపురం, ఫిబ్రవరి 18: రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థులు మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్, లెక్చరర్లు అభినందించారు.

పోస్టాఫీస్‌ను సందర్శించిన విద్యార్థులు

భైంసా, ఫిబ్రవరి, 18 : పట్టణంలోని గుజిరిగల్లి శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు మంగళవారం పోస్టాఫీస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ పోస్టుమాస్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ, పోస్టాఫీసు అందిస్తున్న సేవలపై వివరించారు. ముఖ్యంగా సేవింగ్ అకౌంట్, డిపాజిట్స్, జీవిత బీమా పాలసీలపై విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, విద్యార్థులున్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ పోస్టుమాస్టర్ సంతోష్ కుమార్

అంగన్వాడీల్లో హాజరు శాతం పెంచాలి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 18 : అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరుశాతం పెంచాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాచిగూడ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆమె వెంట ఎంపీవో నసీరొద్దీన్ పాల్గొన్నారు.

నేడు సెలవు దినంగా ప్రకటించాలి

భైంసా, ఫిబ్రవరి, 18 : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 19న రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని భైంసా ఆరె మరాఠా సంఘం గౌరవాధ్యక్షుడు జాదవ్ పుండలిక్ రావు పాటిల్ డిమాండ్ చేశారు. బహుజనుల కోసం జీవితాన్ని అంకితం చేసిన శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర భావితరాలకు తెలియవలసిన అవసరం ఉందని ఆయనన్నారు.

బైక్ ర్యాలీ విజయవంతం చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 18: ఈనెల 19న నిర్మల్ పట్టణంలో నిర్వహించే ఛత్రపతి శివాజీ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని నాయకులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు శివాజీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మెడిసెమ్మ రాజు తెలిపారు. ఇక్కడ మూర్తి ప్రభాకర్, సామనపల్లి రాఘవులు, బొడ్డు లక్ష్మణ్, గొజ్జా జనార్దన్, పాలిశెట్టి విలాస్, వెంకటపతి, సీతారాంపటేల్, కేఎస్ గంగాధర్, తదితరులున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 18 : ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్ష్మణచాంద నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నందున ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ధరణిపై పిర్యాదులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ తహసీల్దార్ జానకి, నాయబ్ తహసీల్దార్ అబ్దుల్ అజీజ్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ జానకితో మాట్లాడుతున్న అదనపు పాలనాధికారి కిశోర్ కుమార్

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన ఆర్డీవో

పెంబి/దస్తురాబాద్/ఖానాపూర్, ఫిబ్రవరి 18: ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంను ఆర్డీవో రత్నాకల్యాణి సందర్శించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, దస్తురాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఆర్ఐ గంగన్న, హెచ్ఎం కోట వేణు,తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖానాపూర్ మున్సిపాలిటీలోని రెండు పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆర్డీవో రత్నా కల్యాణి సందర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆమె వెంట పలు శాఖల అధికారులున్నారు.

దస్తురాబాద్ : పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రత్నమాల

హమాలీలను తొలగిస్తే ఊరుకోం

బోథ్, ఫిబ్రవరి 18 : దశాబ్దాల కాలంగా మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీలను తొలగిస్తే ఊరుకునేది లేదని హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల రాజేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం బోథ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేల మార్కెట్ యార్డులో హమాలీ యూనిన్ సభ్యుడు ఆశిష్ పదేళ్లుగా మార్కెట్ యార్డులో పని చేస్తున్నారన్నారు. అక్కడి ఏఎంసీ చైర్మన్ హమాలీ పనులకు రావొద్దని హుకూం జారీ చేయడం సరికాదన్నారు. ఏళ్లుగా పనిచేస్తున్న హమాలీలను తొలిగిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో హమాలీ యూనియన్ సభ్యులు గణేశ్, కొత్తూరు సంతోష్, మోతే అమృత్‌రావ్, షేక్ బాబు పాల్గొన్నారు.